క్లుప్తంగా

పింఛన్ల పంపిణీ.. లబ్ధిదారుల ఆనందం



లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నరసాపురం: ప్రతినెలా ఇస్తున్న పింఛను మొత్తాన్ని రూ.2,500 నుంచి రూ.2,750 పెంచడం ద్వారా లబ్ధిదారుల్లో ఆనందం నెలకొందని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అన్నారు. సోమవారం పట్టణంలోని 24,17 కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు కార్డులు, పింఛన్ మొత్తాన్ని చైర్‌పర్సన్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ మొత్తాన్ని దశలవారీగా పెంచుతున్నారని పేర్కొన్నారు. ప్రతినెలా 1వతేదీన తెల్లవారక ముందే అందిస్తున్న పింఛన్లతో వృద్ధులు, వింతంతువులు, వికలాంగులు ఎంతో ఆనందపడుతున్నారని అన్నారు. భవిష్యత్తులో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కావలి నాని, గోరు సత్తిబాబు, సోమరాజు భరత్ పాల్గొన్నారు.

చంద్రబాబుపై హత్య కేసు నమోదు చేయాలి

ఉండి: ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ప్రచార పిచ్చికి అమాయకులు బలి అవుతున్న ఘటనలను సుమోటోగా తీసుకుని హత్య కేసులుగా నమోదు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బడుగు బాలాజీ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రచార పిచ్చితో సభలు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలు తీస్తున్న చంద్రబాబు కనీసం రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడిగా కూడా పనికి రాడన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని టీడీపీ గుర్తింపు రద్దు చేయాలని, దీనిపై వెంటనే స్పందించాలని కోరారు. టీడీపీ సభలకు జనం రావడం లేదని గుర్తించిన చంద్రబాబు చంద్రన్న కానుకలు అంటూ ప్రజలను మళ్లీ మోసం చేసే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఆయన ప్రచార యావకు గతంలో, ఇప్పుడు కూడా ప్రజలే బలవుతున్నారన్నారు. ప్రజల ప్రాణాలంటే లెక్కలేకుండా ప్రవర్తిస్తున్న చంద్రబాబుకు ప్రజలు తగిన గుణపాఠం మళ్ళీ చెబుతారని అన్నారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్ర ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారన్నారు. చంద్రబాబు కలలు కనడం మానుకుని ప్రజలంతా ఇదేమి ఖర్మరా బాబు అంటూ తలలు పట్టుకుంటున్నారని విమర్శించారు.

జోగయ్య దీక్షకు కాపు క్లబ్ సభ్యుల సంఘీభావం

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో 27 శాతం ఉన్న కాపులకు ఈబీసీ కోటాలో 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని దీక్ష చేపట్టిన కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకులు, మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య దీక్షకు తామంతా అండగా ఉంటామని కాపు క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద పట్టణ కాపు క్లబ్ సభ్యులు జోగయ్య దీక్షకు సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాపు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాపు క్లబ్ సభ్యులు పెనుమాక రామ్మోహనరావు, వంగా నరసింహరావు, ముచ్చర్ల సంజయ్, రావూరి సుధ, జక్కంపూడి మదన్, ఇంటి శ్రీరాములు, పోకల రాము, యాతం రమేష్, వేరుకొండ దుర్గాప్రసాద్, గందం ఏసుపాదం, బందెల భాస్కరరావు పాల్గొన్నారు. జోగయ్య నివాసం వద్ద పోలీసులు పహారా కాస్తున్నారు. జోగయ్య నివాసానికి వెళ్లే మార్గాల్లో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఉండి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామంలో కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెరుకువాడ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు హెచ్చరించారు. సంక్రాంతి పండగ రోజుల్లో జూదం నిరోధించేందుకు సోమవారం గ్రామ సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించి తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ హైకోర్టు, జిల్లా కలెక్టర్, రెవెన్యూ, పోలీస్ వారి ఉత్తర్వులను అనుసరించి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కఠిన చర్యలకు పూనుకుంటున్నట్లు తెలిపారు. సంక్రాంతి పర్వదినాల్లో సంప్రదాయమైన క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రజలు మొగ్గు చూపాలన్నారు. కోడిపందేలు, జూదం గ్రామంలో నిర్వహిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు పంచాయతీ తరపున చర్యలుంటాయన్నారు. అలాగే గ్రామాభివృద్ధిపై ప్రజాప్రతినిధులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కే.గోపాలకృష్ణ, వీఆర్వో ఎస్.చిన్నారావు, సచివాలయ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

భీమవరం అర్బన్: తాడేరులో సోమవారం పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై వి.అప్పలరాజు చెప్పారు. వారి నుంచి రూ.1100 నగదు స్వాధీనం చేసుకని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పండుగలా పింఛన్ల పంపిణీ

- ఉదయాన్నే పంపిణీ చేసిన వలంటీర్లు
- లబ్ధిదారుల్లో వెల్లివిరిసిన ఆనందం



నరసాపురం మండలం రాజుల్లంకలో కొత్తగా మంజూరైన పింఛన్లను అందిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: తెల్లవారకముందే ఇంటి తలుపు తట్టి అర్హులైన లబ్ధిదారులందరికీ వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తూ వారి కళ్లల్లోఆనందాన్ని నింపుతున్నారు. పాదయాత్రలో చెప్పిన మాట, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ పింఛన్ మొత్తాన్ని పెంచుకుంటూ వెళుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని అన్ని వర్గాల ప్రజలు ఆదరిస్తున్నారు. వికలాంగులకు ఇప్పటికే రూ.3వేలు పింఛన్ అందిస్తున్నారు. మిగిలిన పింఛన్‌దారులకు కూడా ఈ నెల 1న పెంచిన మొత్తంతో కలిపి రూ.2,750 చొప్పున పింఛను అందించారు. దీంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరిసింది. జగనన్న ముఖ్యమంత్రిగా కలకాలం ఉండాలని వారి మాటల్లో ఆనందంతో వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు తాజాగా నూతన సంవత్సరం మొదటి రోజైన ఆదివారం నుంచి అర్హత కలిగిన, కొత్తగా మంజూరైన పింఛన్లను పాతవారితో కలిపి ఆయా ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. నరసాపురంలో ఇప్పటి వరకూ 5,970 పింఛన్లు అందిస్తుండగా తాజాగా 174 కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. నరసాపురం మండలంలో 10,841 పింఛన్లు ఉండగా తాజాగా 368 మందికి మంజూరయ్యాయి. మొగల్తూరు మండలంలో ఇప్పటి వరకూ ఉన్న 10,600 పింఛన్లకు తోడు కొత్తగా 257 పింఛన్లు మంజూరయ్యాయి. గత చంద్రబాబు ప్రభుత్వంలో కొత్తగా పింఛన్ మంజూరుకు అవస్థలు ఎదుర్కోవాల్సి వచ్చేందని అవ్వాతాతలు అన్నారు. సీఎం జగనన్న అర్హతే ప్రాతిపతికగా అందరికీ పింఛన్లు మంజూరు చేయడంపై సర్వత్రా హర్షాతి రేకాలు వ్యక్తం అవుతున్నాయి.

మాలాంటి వారికి పింఛన్ ఎంతో ఆసరా



వృద్ధుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పింఛన్లు మంజూరు చేయడం మంచి ఆలోచన. వలంటీర్‌కు చెప్పి దరఖాస్తు చేసుకోవడంతో నాకు పింఛన్ మంజూరైంది. ఈరోజే రూ.2,750 పింఛన్ సొమ్మును ఇంటివద్దకే తీసుకు వచ్చి అందించారు.

– పెచ్చెట్టి మంగమ్మ, పింఛన్ లబ్ధిదారు, లిఖితపూడి

ఇంటి తలుపుతట్టి పింఛన్ ఇచ్చారు



కొత్త సంవత్సరం మొదటి రోజు పొద్దున్నే మాఇంటి ముంగిటకు తీసుకు వచ్చి నాకు మంజూరైన పింఛను సొమ్మును వలంటీర్ అందించారు. నాకు చాలా ఆనందంగా ఉంది. నాలాంటి అభాగ్యులకు మంచి మనసుతో పింఛన్ అందిస్తున్న సీఎం జగన్ నిండు నూరేళ్లు చల్లగా ఉండాలి.

– గోగులమంద మావుళ్లమ్మ, వితంతు పింఛన్ లబ్ధిదారు, కొప్పర్రు పెదపేట

రూ.3,000 పింఛన్ అందుకున్నాను



నాకు కొత్తగా మంజూరైన పింఛన్ సొమ్ము రూ.3,000 ఇంటికి తీసుకొచ్చి మరీ అందించారు. చాలా ఆనందంగా ఉంది. నాలాంటి వారితో పాటు వృద్ధులందరికీ వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్లు మంజూరు చేస్తున్న జగనన్నకు రుణపడి ఉంటాను.

– చింతపల్లి త్రిమూర్తులు, వికలాంగ పింఛను లబ్ధిదారు, మంగళగుంటపాలెం

అవ్వాతాతలకు అండగా సీఎం జగన్



కొడమంచిలిలో చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: కొత్త సంవత్సరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాతాతలకు వారి జీవితాంతం అండగా నిలుస్తూ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ మొత్తం పెంచారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం కొడమంచిలిలో పింఛన్లు పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ పెంచుతున్నారని అన్నారు. రూ.2,750 అందిస్తూ అవ్వాతాత కళ్లల్లో ఆనందాన్ని చూస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టి పాలన సాగిస్తే, సీఎం జగన్ ఇచ్చిన హామీలనే కాకుండా, ఇవ్వని హామీలను సైతం అమలు చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా ఎంతమంది అర్హులు ఉన్నా పింఛన్లు మంజూరు చేస్తున్నారన్నారు.

సాంకేతికంగా అండగా

రాష్ట్రంలో విద్యార్థులు సాంకేతికంగా ముందంజ వేయాలన్న లక్ష్యంతో 8వ తరగతి విద్యార్థులకు సీఎం జగన్ ట్యాబ్‌లు అందించారన్నారు. కొడమంచిలిలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి, 8వతరగతి విద్యార్థులకు అందిన ట్యాబ్‌లను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమాన్ని సద్వినియోగం చేసుకొని చదువులో ముందంజ వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, మాజీ ఛైర్మన్ సుంకర ఇందిర, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరక్టరు పోతుమూడి రామచంద్రరావు, సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ, దేవస్థానం ఛైర్మన్ బాలనాగు నరేష్, ఎంపీటీసీ చిలుకూరి నాగదుర్గా భవానీ,చింతపర్తి హరికృష్ణ, జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, బొక్కా రామకృష్ణ, గున్నాబత్తుల వెంకటాచారి, ఇంజేటి సుగుణరాజు, కప్పల చంద్రశేఖర్, గుండే శేఖర్, మాండ్రు బాబూరావు, కొంబోత్తుల రత్నరాజు, నేలపూడి రామకృష్ణ, పుచ్చకాయల సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

పాలనలో సమూల మార్పుతో అభివృద్ధి వేగవంతం

పెనుమంట్ర: పాలనా వ్యవస్థలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సమూల మార్పులు తీసుకురావడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి వేగవంతమైందని, సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు చేరువ అవుతున్నాయని పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి అన్నారు. మార్టేరులోని సచివాలయ గ్రామసభ సోమవారం శివరావుపేటలోని సర్పంచ్ మట్టా కుమారి అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుభాషిణి మాట్లాడుతూ మార్టేరులో ఎన్నడూలేని విధంగా జగనన్న పాలనలో స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి పూర్తిచేశామని తెలిపారు. మార్టేరులో 465 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఎమ్మెల్యే సహకారంతో మార్టేరు సెంటర్‌లో సులభ్ కాంప్లెక్స్, మూడు బస్‌స్టేషన్ నిర్మించామని తెలిపారు. మార్టేరు శివరావుపేటలో రూ. 25 లక్షలతో కమ్యూనిటీహాలు నిర్మాణం పూర్తికావస్తోందని చెప్పారు. మార్టేరు అభివృద్ధికి ఎంతో కృషిచేస్తున్న రంగనాథరాజుని ప్రజలు ఆశీర్వదించాలని ఆమె పిలుపునిచ్చారు. సర్పంచ్ కుమారి మాట్లాడుతూ గ్రామంలో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నామన్నారు. ఈసందర్భంగా గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఎమ్మెల్యే రంగనాథరాజుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కర్రి అనురాధా జోగిరెడ్డి, ఉప సర్పంచ్ కర్రి వేణుబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిర్ల సత్యనారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి తమనంపూడి ఈశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు పత్తికాయల శ్రీనివాస్, కొవ్వూరి బ్రహ్మేశ్వరరెడ్డి, సత్తిసుబ్బారెడ్డి, వెలగల నారాయణరెడ్డి, సత్తి చంద్రారెడ్డి, శత్రుఘ్నరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువకుడిపై కేసు నమోదు

మొగల్తూరు: అత్యాచారం చేయబోయాడంటూ ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదుమేరకు యువకుడిపై కేసు నమోదు చేసినట్టు ఇన్‌చార్జ్ ఎస్సై ఎస్.ప్రియకుమార్ సోమవారం తెలిపారు. మొగల్తూరు స్టేషన్ పరిధి పసలదీవికి చెందిన ఓ యువతి అదే గ్రామానికి చెందిన లక్కు రమేష్ అత్యాచారం చేయబోయాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు


- విష్ణాలయాల్లో పోటెత్తిన భక్తులు
- హరినామస్మరణలతో మార్మోగిన ఆలయాలు



యలమంచిలిలో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణ



వేములదీవిలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి



ఆదికేశవ ఎంబేరుమానార్ కోవెలలో పూజలందుకుంటున్న స్వామివారు

పాలకొల్లు సెంట్రల్: ముక్కోటి ఏకాదశి పర్వదినం, సోమవారం సందర్భంగా విష్ణాలయాల్లో, క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను భక్తి శ్రద్ధలతో పూజించారు. భక్తుల శివకేశవుల నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉత్తరద్వార దర్శనం కోసం భక్తులు వేకువజాము నుంచి ఆలయాలకు క్యూ కట్టారు. ఉదయం 5.30 గంటలకు ఉత్సవ మూర్తులను పల్లకిలో ఏర్పాటుచేసి ఉత్తర ద్వారం ద్వారా బయటకు తీసుకువచ్చారు.ఉత్తర ద్వార దర్శనం అనంతరం ఉత్సవ మూర్తులను సభా మండపాల్లోకి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో జనార్దనస్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఉత్సవమూర్తులను ఉత్తర ద్వారం ద్వారా కొట్టాయం మండపంలోకి తీసుకువచ్చి పూజలు నిర్వహించారు. శ్రీ అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. కెనాల్ రోడ్డులోని దాసోహంజనేయస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామిని శేషపాన్పుపై శ్రీరంగనాథస్వామిగా అలంకరించారు. చినబజారులో వేంకటేశ్వరస్వామి, యడ్లబజారు సెంటర్‌లో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల వద్ద దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

భక్తి శ్రద్ధలతో పూజలు

యలమంచిలి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం యలమంచిలి, మేడపాడు గ్రామాల్లోని మంచినీటి చెరువు గట్టున ఉన్న ఆంజనేయస్వామి ఆలయాలను సుందరంగా అలంకరించారు. ఆంజనేయస్వామిని తమలపాకులు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. కొంతేరు కుంతీ లక్ష్మీ నరసింహ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో కేశవ స్వామి

పెనుగొండ: కొఠాలపర్రులోని స్వయంభువు కేశవస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం పెనుగొండ, ఆచంట మండలాల్లోని విష్ణు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఉత్తర ద్వార ప్రవేశం కల్పించారు. గరుడ వాహనంపై కేశవస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కొమ్మిరెడ్డి త్రిమూర్తులు, ట్రస్టీలు, దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పెనుగొండ క్షేత్ర పాలకుడు జనార్ధన స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. సిద్ధాంతంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.

జుత్తిగలో శ్రీలక్ష్మీజనార్ధనస్వామికి విశేష పూజలు

పెనుమంట్ర: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం జుత్తిగలోని ఉమావాసుకి రవిసోమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కళకళలాడింది.స్వామివారిని గరుడవాహనంపై ఉంచి గ్రామంలో ఊరేగించారు.

ఆదికేశవ ఎంబేరుమానార్ కోవెలలో పూజలు

నరసాపురం: ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని పట్టణంలో సోమవారం వైష్ణవ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.ఉత్తరద్వారంలో స్వామివార్లను భక్తులు దర్శించుకున్నారు. పట్టణంలోని ప్రసిద్ధ ఆదికేశవ ఎంబేరుమానార్ కోవెలకు భక్తులు పోటెత్తారు. ఆదికేశవస్వామిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకున్నారు. వేణుగోపాలపస్వామి, మదనగోపాలస్వామి, పాతబజార్ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది.

వైకుంఠ ద్వార దర్శనానికి తరలివచ్చిన భక్తులు

మొగల్తూరు: మొగల్తూరులోని వేంకటేశ్వర స్వామి ఆలయం, రాజగోపాల స్వామి ఆలయం, కొత్తోటలోని బాల వేంకటేశ్వర స్వామి ఆలయం, పేరుపాలెం బీచ్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో సోమవారం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

వేములదీవిలో వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ

నరసాపురం రూరల్: వేములదీవి పడమర పంచాయతీ కాపుల కొడపలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించారు. మండలంలోని మల్లవరం వేంకటేశ్వరస్వామి ఆలయం, పసలదీవి రామాలయం, వేములదీవి ఆదివారం మార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనం, ముక్కోటి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లక్ష్మణేశ్వరం చాగంటివారి మెరకలోని రామాలయంలో ముక్కోటి వేడుకలు నిర్వహించారు.పసలదీవి రామాలయంలో వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో జనార్ధనస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కెనాల్ రోడ్డులో శ్రీరంగనాథస్వామిగా దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామి

గ్రామాల అభివృద్ధికి నిధులు సిద్ధం

మొగల్తూరు: ఎంపీటీసీ సభ్యులకు అందించిన రూ.2లక్షలను గ్రామాభివృద్ధికి ఖర్చు చేస్తే వెంటనే మరో రూ.2 లక్షల నిధులు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎంపీపీ అందే సూర్యావతి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా వివిధ శాఖలతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖాధికారిణి ఎం సుజాత మాట్లాడుతూ మండలంలోని 4,423 మంది రైతులకు రైతు భరోసా రూ.17.84 కోట్లు, ఇన్ పుట్‌సబ్సిడీ 1,177 మంది రైతులకు రూ 38.82 లక్షలు, క్రాప్ ఇన్సూరెన్స్ 641 మంది రైతులకు రూ.1.70 కోట్లు, తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులకు సుమారు 612 మందికి రూ.38.79 లక్షలు అందిస్తామన్నారు. ప్రతి రైతు పంట వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేసుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు వర్తిస్తాయన్నారు. ఎంఈవో పుష్పరాజ్యం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 8వ తరగతి విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లను మండలంలోని 619 మంది విద్యార్థులకు, 80 మంది ఉపాధ్యాయులకు పంపిణీ చేశామన్నారు. ఇరిగేషన్ ఏఈ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ వియ్యర్ ఛానల్ పనులకు రూ.24 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ సమావేశ మందిరం తరుచూ మరమ్మతులకు నోచుకోవడంతో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని తీర్మానించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీ కవురు సీతామహాలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు అందే భుజంగరావు, దొంగ నాగముని, దూసనపూడి దొరబాబు, ఆకన దొరబాబు, తహసీల్దార్ జి అనితకుమారి, ఎంపీడీవో ఆర్‌సీ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు

- మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు
- కొడమంచిలిలో గడపగడపకు మన ప్రభుత్వం



కొడమంచిలిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: నవరత్నాలు అమలు చేయడం ద్వారా రాష్ట్రంలో పేదల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ వెలుగులు నింపారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం కొడమంచిలిలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్హులకు అందించిన లబ్ధిని వివరించి, సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా సావిత్రీ బాయి పూలే 192వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళాసాధికారితే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు,

ప్రచార ఆర్భాటంతో ప్రాణాలు తీస్తున్న చంద్రబాబు

చంద్రబాబుకు ఉన్న ప్రచార ఆర్భాటం పరాకాష్టకు చేరడంతో, ప్రజల ప్రాణాలు తీస్తున్నారని మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు విమర్శించారు. ఏనాడు ఇచ్చిన హామీలు నెరవేర్చని చంద్రబాబు, ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు. దీనికోసం కానుకల పేరుతో సభలు నిర్వహించి, జాగ్రత్తలు గాలికొదిలేయడంతో సభకు వచ్చిన వారి ప్రాణాలు తీస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆచంట ఏఎంసీ ఛైర్మన్ చిల్లే లావణ్య, మాజీ ఛైర్మన్ సుంకర ఇందిర, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ, దేవస్థానం ఛైర్మన్ బాలనాగు నరేష్, ఎంపీటీసీ చిలుకూరి నాగదుర్గా భవానీ, పుచ్చకాయల నాగార్జున, బొక్కా మల్లేశ్వరరావు, బొదతా సుబ్బారావు, సాక సురేష్, కొండేటి సురేష్, పోలిశెట్టి వనమరాజు, బొరుసు రాంబాబు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలు అలవాటు చేసుకోవాలి



కాజ పడమరలో బ్యాంకు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

యలమంచిలి: బ్యాంకు ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ డిజిటల్ లావాదేవీలకు అలవాటు చేసుకోవాలని మేడపాడు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఎస్‌వీవీజే మహంకాళిరావు కోరారు. కాజ పడమర గ్రామంలో సోమవారం ఆయన బ్యాంకు ఖాతాదారులకు, డ్వాక్రా మహిళలకు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ముందుగా నాబార్డు సహకారంతో గుంటూరుకు చెందిన కళాకారులతో బ్యాంకు ఆర్థిక లావాదేవీలపై వీధి నాటకం ప్రదర్శించారు. అనంతరం మహంకాళిరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో లబ్ధి పొందాలంటే ప్రతి వ్యక్తికి బ్యాంకు ఖాతా ఉండాలని సూచించారు. ఖాతా ఉన్న వారంతా క్రెడిట్, డెబిట్ కార్డు తీసుకుని నెట్ బ్యాంకింగ్ అలవాటు చేసుకుంటే బ్యాంకులో రద్దీ తగ్గడంతోపాటు, ప్రతి ఒక్కరికీ తమ విలువైన సమయం ఆదా అవుతుందన్నారు. అదే సమయంలో సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఏ బ్యాంకు కూడా ఖాతాదారుల వ్యక్తిగత వివరాలు, పిన్, ఓటీపీలు ఫోన్ ద్వారా అడగదని, ఫోన్‌లో ఇటువంటి వివరాలు ఇతరులకు చెప్పవద్దని కోరారు. బ్యాంకు సీనియర్ ఫైనాన్షియల్ లిటరసీ కౌన్సిలర్ కె రామకృష్ణంరాజు బ్యాంకు సేవలను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎంఎల్ఎం దేవి, సిబ్బంది పి అవినాష్, చీడే రవి, బిజినెస్ కరస్పాండెంట్స్ చల్లా దేవి, బిందు, దుర్గ పాల్గొన్నారు.